క్లుప్తంగా

తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి



మడికొండ: ప్రజలు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 64వ డివిజన్ మడికొండలో ప్రజలకు స్వచ్ఛతపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జవాన్ మల్లయ్య, కిరణ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై పిచ్చికుక్కల దాడి



హసన్‌పర్తి: పెంబర్తికి చెందిన అండమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. కుక్కల దాడి నుంచి తప్పించుకోవడానికి వృద్ధురాలు పరుగుదీసినప్పటికీ అవి ఆమె వెంటపడి దాడి చేశాయి. గాయపడిన అండమ్మను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆల్ ఇన్ వన్ బుక్స్ పంపిణీ



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెగడపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోటరీ వరంగల్ క్లబ్ సహకారంతో శనివారం ఆల్ ఇన్ వన్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ సభ్యుడు కుజాంపురం దామోదర్ మాట్లాడుతూ సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్ఎం శోభారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కుమారస్వామి, సభ్యులు సదానందం, గణేష్, ప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి

గీసుకొండ: విద్యార్థులకు సులభ పద్ధతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలని విద్యాశాఖ వరంగల్ జిల్లా మానిటరింగ్ అధికారి సుజన్ తేజ అన్నారు. జిల్లాలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ బోధిస్తున్న ఉపాధ్యాయులకు 'ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్'ను ఉపయోగించే విధానంపై శనివారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానిమేటెడ్ వీడియో పాఠాలు, లైబ్రరీ, పాఠ్యపుస్తకాలతో కూడిన బోధన ఈ విధానంలో చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్లు సాగర్, అంజయ్య, పూల శ్రీనివాస్, గౌస్ పాషా, మహేశ్వర్, ఎంఈఓ సాంబయ్య, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ సరెండర్?

కాశిబుగ్గ సెంటర్: వరంగల్ విద్యాశాఖ కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌ను సరెండర్ చేస్తూ కలెక్టర్ సత్య శారద శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. డీఈఓ వ్యవహారశైలిపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. డీఈఓ కార్యాలయ సిబ్బందితోపాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. డీఈఓ కార్యాలయంలోని పలు విషయాలను వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈక్రమంలో ఎస్టాబ్లిష్‌మెంట్‌లోని సెక్షన్ సీనియర్ అసిస్టెంట్‌ను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

20శాతం నిధులు కేటాయించాలి

విద్యారణ్యపురి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ కమిటీలోని డీటీఎఫ్, టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు శనివారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్టీరింగ్ కమిటీ బాధ్యుడు, డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో సంక్షోభంలోకి నెట్టివేయడిందన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 15శాతం నిధులు కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం.. 7.3శాతం నిధులే కేటాయించిందన్నారు. దేశంలో వివిధ రాష్ట్రాలు సగటున 14.7శాతం వరకు కేటాయిస్తుండగా.. ఏపీలోనూ 12శాతం నిధులు కేటాయించారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఆధారాలు లేకుండా ఆరోపణలు

వరంగల్: వాస్తవాలు తెలుసుకోకుండా, ఆధారాలు లేకుండా మావోయిస్టు నాయకుడు వెంకటేశ్ తనపై ఆరోపణలు చేయడం తగదని హైకోర్టు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మిక భవన్ భూమి అమ్మకం, కొనుగోలు వ్యవహారాల్లో తనకు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. కార్మిక భవన్ స్థలం అమ్మిన వారు, కొన్న వారు ఎవరో కూడా తెలియదని, ఆ డాక్యుమెంట్స్‌తో కూడా తనకు సంబంధం లేదని పేర్కొన్నారు.

రోడ్డుపైనే దుకాణాలు



రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్న కొబ్బరిబోండాల దుకాణ యజమానులు

● నిత్యం ట్రాఫిక్ జామ్

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 6వ డివిజన్ మర్కజీ జంక్షన్ ఇరుకుగా ఉండి భారీ ట్రాఫిక్‌తో చాలా రద్దీగా ఉంటోంది. మర్కజీ స్కూల్ నుంచి కొత్తూర్ వైపు వెళ్లడానికి ఫ్రీ లెఫ్ట్ లేకపోవడంతో పెట్రోల్ పంప్ – హనుమకొండ చౌరస్తా ప్రధాన రోడ్డుపైన భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడ ప్రధాన రోడ్డుపైన కొబ్బరి బొండాల దుకాణదారులు దర్జాగా ఫుట్‌పాత్, ప్రధాన రహదారిని కబ్జా చేసి దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొబ్బరి బొండాలు తాగేవారు రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. కొబ్బరి బొండాలు రోడ్డుపైకి దొర్లుకుంటూ రావడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

వాలీబాల్ క్రీడా పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ క్రైం: ఈనెల 16, 17వ తేదీల్లో మూల వెంకట్‌రెడ్డి స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను హనుమకొండలోని జేఎన్ఎస్ మైదానంలో నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎస్బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు స్మారక వాలీబాల్ పోటీల వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాలీబాల్ పోటీల విజేతలకు మొదటి స్థానంలో నిలిచిన టీంకు రూ.20 వేలు, రెండవ స్థానంలో టీంకు రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన టీమ్‌కు రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగయ్య, బొబ్బిలి వెంకట్‌రెడ్డి, బొబ్బిలి లింగారెడ్డి, సుధాకర్, సారంగపాణి, ద్రోణాచారి, శేఖర్‌గౌడ్, సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏసీపీ, తదితరులు

కేయూలో జాతీయ సదస్సులు



కామర్స్ విభాగంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, కామర్స్ విభాగం ఆచార్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ సంయుక్తంగా మార్చి 12, 13వ తేదీల్లో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. న్యూ హారిజన్స్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డ్యూరింగ్ 21ఎస్ సెంచరీ – చాలెంజెస్ అండ్ అపార్చునుటీస్ అనే అంశంపై నిర్వహించనున్న సదస్సు పోస్టర్‌ను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఓఎస్ చైర్మన్ ఆచార్య రాజేందర్, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, నర్సింహాచారి, డాక్టర్ ఫణీంద్ర కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో..

కాకతీయ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 21, 22వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. భారత రాజకీయాలు – సంకీర్ణ రాజకీయాలు – ప్రజాస్వామ్యం అనే అంశంపై జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రాంచంద్రం, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ మనోహర్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, అధ్యాపకులు సత్యనారాయణ, నాగరాజు, సంజీవ, లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, రీసెర్చ్ స్కాలర్స్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం, ఆనందం

వరంగల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి దోహదపడుతాయని వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. వరంగల్‌లోని ఓసిటీ మైదానంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో గొప్పస్థాయికి వెళ్లాలని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం డీడీ చింతల అన్వేష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, పీఈటీలు జలగం రఘువీర్, శ్రీనివాస్, సమ్మయ్య, సుభద్ర, సురేష్, భిక్షపతి రాజు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో సీఐ రామకృష్ణ, డీడీ అన్వేష్

సత్ప్రవర్తన పెంపొందుతుంది



మాట్లాడుతున్న ఎస్సై రవికుమార్

హసన్‌పర్తి: క్రీడలతో సత్ప్రవర్తన పెంపొందుతుందని ఎస్సై రవికుమార్ అన్నారు. నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న బ్లాక్‌స్థాయి స్పోర్ట్స్ మీట్ హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఎస్సై రవికుమార్ హాజరై మాట్లాడుతూ చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుమాదేవి, విజయలక్ష్మి, నెహ్రూ యువజన కేంద్రం క్రీడోత్సవాల వలంటీర్ మంద రాజేష్, పీఈటీ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విద్యారణ్యపురి: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సుభాష్ చంద్రబోస్, వివేకానందుడి లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు సూచించారు. ఏబీవీపీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు హనుమకొండ సామ జగన్మోహన్ భవనంలో బహుమతుల శనివారం ప్రదానం నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ విభాగ్ సంఘటన కార్యదర్శి కుంట హర్షవర్ధన్, బాధ్యులు ఆరెపల్లి సుజిత్, సుధాకర్, హరిచరణ్, తాళ్లపెల్లి అరుణ్, శ్రవణ్, భరత్, రోహిత్, శ్రీకాంత్, కార్తీక్, రేవంత్, గణేష్ పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

'కిట్స్'లో ముగిసిన సంస్కృతి -25

హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి దార్ధి కార్నివాల్ 'సంస్కృతి – 25' కార్యక్రమం విద్యార్థుల కేరింతల మధ్య శనివారం ముగిసింది. కార్యక్రమాన్ని పురస్కరించుకుని అధ్యాపకుల రాంప్ వాక్ అదిరింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పృథ్వీసాయి డీజే యువతను ఉర్రూతలుగించింది. కార్యక్రమంలో కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ శ్రీలత, కోకన్వీనర్ ప్రొఫెసర్ నర్సింహారావు, ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకరాచారి, విద్యార్థి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందన



కేయూ క్యాంపస్: ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి పాల్గొన్న నలుగురు ఎన్‌సీసీ కేడెట్లు బి.ప్రశాంత్, ఎం.భావన, దినేష్, నివేదిక కళాశాలలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ పుల్లా రమేష్, లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే, కేడెట్లను కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతితో కలిసి వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాంచంద్రం శనివారం అభినందించారు. ఆర్మీ వింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి, ఎయిర్‌వింగ్ ఎన్‌సీసీ ఫ్లాగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్‌ను సన్మానించారు.

యూజీసీ నిబంధనలను ఉపసంహరించుకోవాలి



కేయూ క్యాంపస్: యూజీసీ నూతన నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) కాకతీయ యూనివర్సిటీ బాధ్యులు కేయూ గేట్‌వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ కేయూ నాయకుడు మర్రి మహేష్ మాట్లాడుతూ నూతన నిబంధనల ప్రకారం యూనివర్సిటీల వీసీలను వైస్ చాన్సలర్లే నియమిస్తారని, అది సరికాదని అన్నారు. కార్యక్రమంలో గణేష్, పవన్, సందీప్, సతీష్, అశోక్, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డప్పుల బహూకరణ



కాజీపేట రూరల్: లక్ష డప్పులు.. వేల గొంతుకల కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు పది డప్పులను వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ శనివారం బహూకరించారు. ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు రేణిగుంట్ల మహేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పిల్లి కృష్ణహర్, బొడ్డు దేవయ్య, కొండ్ర తిరుపతి, మునిగాల దాసు, సిలువేరు కరుణాకర్, అడ్వకేట్ దుబాసి నర్సింగరావు, రామగిరి శ్రీనివాస్, మునిగాల ప్రసాద్, బొజ్జపల్లి నరసింహారావు, వనపాకల రాజేందర్, నద్దునూరి చిన్న, రాజారపు క్రాంతికుమార్, కటుకూరి అరుణ్‌రాజ్, మంద స్వరాజ్, ఇనుగాల రాజు, జన్ను పృథ్వీ, గొర్రె మోహన్, నద్దునూరి నాగరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ 38వ డివిజన్ మధ్యకోటలో నాయీ బ్రాహ్మణ, మున్నూరు కాపు వీధుల్లో శనివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈమేరకు రోడ్డు పనులను బల్దియా అధికారులు, స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ శనివారం పరిశీలించారు. మాజీ కార్పొరేటర్ దామోదర్, గజ్జల శ్యామ్, సారంగపాణి, చందర్, రవీందర్, పరమేశ్వర్, చేరాలు, అశోక్, నాగరాజు, సాంబయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

46వ డివిజన్‌లో..

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలోని వడ్డెర కాలనీలో రూ.4కోట్ల 85 లక్షల వ్యయంతో చేపట్టిన స్మార్ట్ సిటీ పనులను కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, పల్లపు అర్జున్, పల్లపు రాజ్‌కుమార్, రవి, కుమార్‌రాజా, పెనుకుల వినయ్, ఉదయ్, రాజు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత హఠాన్మరణం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ఏసీరెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన సీపీఎం నేత రాయరాకుల చంద్రమౌళి శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈమేరకు ఆయన మృతదేహాన్ని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల, స్థానిక కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఉదయ్, రాధమ్మ, రమేష్, జరీనా, లక్ష్మక్క, వాసు, అన్నపూర్ణ, కవిత పరామర్శించారు.

భీష్మ ఏకాదశి పూజలు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయ ఆవరణలో భీష్మ ఏకాదశి పూజలను తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం సభ్యులు శనివారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామాలు పఠించారు. ఆలయంలో పేదలకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం చేశారు.

'వాగ్దేవి'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కాలేజ్‌లో శనివారం ఫార్మడీ ఆరో సంవత్సరం ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్, ఇన్నోవేషన్స్ ఆన్ ఎస్ఏఎస్, ఫార్మకో విజిలెన్స్‌పై వర్క్‌షాప్, విదేశాల్లో విద్యా, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన 4సీ ఫార్మా సొల్యూషన్స్ రాజశేఖర్ దంతా, క్రిస్టల్ ఓవర్సీస్ కన్సల్ట్స్ డాక్టర్ ఏ.మహేష్, క్లిన్‌ఫోండ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వీ.మహేష్ పాల్గొని క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన 10మంది విద్యార్థులు, వాగ్దేవికి చెందిన ఐదుగురికి ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి

● వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్: జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి అధికారులు కృషిచేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీతో కలిసి శనివారం జిల్లా పర్యాటక ప్రమోషన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంటాక్ కోకన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారావు, అన్ని శాఖల అధికారులు, చరిత్రకారులు పాల్గొన్నారు.

కోట చెరువులో వ్యర్థాలను తొలగించాలి..

వరంగల్‌లోని కోట చెరువులో వ్యర్థాల తొలగింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులను కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు కోట చెరువు శుద్ధీకరణకు చేపట్టిన చర్యలపై కలెక్టరేట్‌లో ఇరిగేషన్, బల్దియా, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కోట చెరువు సుందరీకరణ, ఫెన్సింగ్, ఎఫ్‌టీఎల్ హద్దుల ఏర్పాటు, బండ్ బలోపేతానికి తీసుకున్న చర్యలపై ఈనెల 25న విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో మాట్లాడి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.



వరంగల్: మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ప్రభుత్వ పాఠశాలల్లో 'స్ఫూర్తి'

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి శనివారం మధ్యాహ్నం స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వరంగల్ కలెక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు లైఫ్ స్కిల్స్, డెవలప్‌మెంట్ ఆఫ్ రిఫార్మ్ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతించిందని ఆమె పేర్కొన్నారు. డీఆర్‌డీఓ కౌసల్యాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇందుకోసం మొదటి దశ కార్యక్రమాన్ని ఖానాపురం మండలంలో నిర్వహించేందుకు తాత్కాలిక షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు.

ప్రజా వ్యతిరేక, దోపిడీ వర్గాల కేంద్ర బడ్జెట్

హన్మకొండ: ప్రజా వ్యతిరేక, దోపిడీ వర్గాలకు అనుకూల బడ్జెట్‌ను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఎంసీపీఐ (యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి విమర్శించారు. ఎంసీపీఐ(యూ), ఆర్ఎంపీఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం, సంపన్న వర్గాల కోసమే కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా మొదటి నుంచి విభజించు పాలించు అనేవిధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి విభజన హామీల అమలుకు కేంద్రం సహకరించడం లేదని ఎద్దేశాచేశారు. విద్య, వైద్యం, కనీస అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నీల రవీందర్, వక్కల కిషన్, దామరకొండ రమేష్, మట్టెడ మొగిలి, శ్రీకాంత్, శిరీష, సిద్ధు, ప్రేమలత పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

కుట్రపూరితంగా బీసీ జనాభాను తగ్గించారు



సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

నయీంనగర్: సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలకు అన్యాయం జరిగిందని, బీసీ జనాభా 58 శాతం ఉండగా 45శాతం మాత్రమే ఉందని తక్కువ చేసి చూపించారని మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య విమర్శించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులను రాజకీయంగా దెబ్బకొట్టడానికే సమగ్ర కుటుంబ సర్వేలో 13లక్షల జనాభాను తగ్గించి 15లక్షలకు కుదించారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో సీట్ల కేటాయింపులోనూ రాజకీయ కుట్ర జరుగుతోందని అన్నారు. ఇప్పటికే 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. సమావేశంలో కుల సంఘం నాయకులు గైనేని రాజన్, కటకం పెంటయ్య, బండి కుమారస్వామి, రవికుమార్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ ఏబీసీడీ వర్గీకరణ చేయాలి

హన్మకొండ చౌరస్తా: విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడి, అసమానతలకు గురైన ఎస్టీ తెగలను గుర్తించి, ఏబీసీడీ వర్గీకరణ చేయాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో శనివారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ తెగల్లో ఎరుకలు అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.500 కోట్ల నిధులు విడుదల చేయాలని సూచించారు. ట్రైకార్ సంస్థకు 2024 – 25 సంవత్సరానికి రూ.360 కోట్లు కేటాయిస్తే, ఇంతవరకు ఎరుకల జాతికి ఒక్క రూపాయి కూడా అందలేదని వాపోయారు. సమావేశంలో సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, లోకిని సమ్మయ్య, మానుపాటి రమేష్, లోకిని చందర్, పలిచేరు రవీందర్, దేవరాయ సమ్మయ్య, కోనేటి సమ్మయ్య, ఓని సదానందం, పాలకుర్తి నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకిని రాజు

10న కేయూలో వైద్య శిబిరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా టీచర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ డాక్టర్ వాసవి ఆస్పత్రి సౌజన్యంతో క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో ఈనెల 10న ఉదయం 10గంటలకు మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉమెన్ వెల్‌నెస్ అవేర్‌నెస్ ప్రోగ్రాం, వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హెల్త్ సెంటర్ మెంబర్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సంబంధిత పోస్టర్‌ను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రాంచంద్రం, తదితరులు ఆవిష్కరించారు.

ఢిల్లీలో బీజేపీ గెలుపుపై హర్షం



హన్మకొండ చౌరస్తా: బాణసంచా కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



జన్మభూమి జంక్షన్‌లో నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

హన్మకొండ చౌరస్తా: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు హనుమకొండ చౌరస్తాలో శనివారం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సుదర్శన్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, చాంద్‌పాషా, సంపత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

జన్మభూమి జంక్షన్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ జన్మభూమి జంక్షన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నె రవీందర్, నాయకులు బైరి నాగరాజు, దీన్‌దయాళ్, ఆకుతోట రాజు, కర్నె వాసుదేవ్ పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో నాయకులు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మాజీ ఎంపీటీసీ కుమారస్వామి, పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: కాజీపేట పట్టణంలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్, గిరి తిరుపతి, తిప్పారపు కృష్ణంరాజు, బాలాజీ నాయక్, హరీష్ బాబు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో..

మడికొండ: మడికొండ చౌరస్తాలో బాణసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. పానగోటి వెంకట్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, బొల్లికొండ వినోద్, దార ధనుంజయ్, శివ, మాచర్ల రంజిత్, వస్కుల మౌళి, బుర్ర నరేష్, రాజేందర్, కిరణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.